క్లుప్తంగా

గొడిచెర్ల విద్యా కమిటీ చైర్మన్ ఎన్నిక ఏకగ్రీవం



ఎన్నికైన వారిని అభినందిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుడు

నక్కపల్లి: మండలంలోని గొడిచెర్ల ప్రాథమిక స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నిక గురువారం ఏకగ్రీవంగా జరిగింది. గతంలో వాయిదా పడిన ఈ ఎన్నిక గురువారం నిర్వహించారు. చైర్మన్‌గా వైఎస్సార్ సీపీ మద్దతుతో ఎల్.జ్యోతిబాబు, వైస్ చైర్మన్‌గా నంబరపు దేవి ఎన్నికయ్యారు. వారిని సర్పంచ్ అల్లు రమణ, ఎంపీటీసీ సభ్యుడు నిట్ల గోవిందు అభినందించారు.

ఫలసాయంతో పార్కు శుభ్రతకు అవకాశం

పాయకరావుపేట: పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పార్కులో పెరిగిన తుప్పలు తొలగింపునకు అధికారులు చర్యలు తీసుకోవాలని విశ్రాంత ఏఎస్‌డబ్ల్యూవో జె.ప్రసాదరావు ఒక ప్రకటనలో కోరారు. పార్కులో ఉన్న మామిడి చెట్ల ఫలసాయం నుంచి వస్తున్న రాబడిని పార్కు పరిశుభ్రతకు వినియోగించాలన్నారు. తాను పాయకరావుపేటలో ఏఎస్‌డబ్ల్యూవోగా పని చేసినప్పుడు చెట్ల ఫలసాయం ద్వారా వచ్చిన ఆదాయం పార్కు పరిశుభ్రతకు ఖర్చు చేసినట్టు పేర్కొన్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించి పార్కు పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నాగులాపల్లి హైస్కూల్‌కు జిల్లా స్థాయి అవార్డు



ఎమ్మెల్యే కొణతాల నుంచి అవార్డు స్వీకరిస్తున్న నాగులాపల్లి హైస్కూల్ ఉపాధ్యాయులు

మునగపాక: మండలంలోని నాగులాపల్లి హైస్కూల్‌కు జిల్లా స్థాయి స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్స్‌లెన్స్ అవార్డు దక్కింది. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా అనకాపల్లి జిల్లా విద్యా శాఖ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీలో భాగంగా గురువారం నిర్వహించిన పలు పోటీల్లో నాగులాపల్లి విద్యార్థులు ప్రతిభ చూపారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో వంటి క్రీడల్లో సాధించిన ప్రతిభకు జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. ఈ మేరకు అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, జిల్లా విద్యాశాఖాధికారి విజయలక్ష్మమ్మ చేతుల మీదుగా హైస్కూల్ హెచ్‌ఎం కె.శంకరరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.సూర్యనారాయణ అవార్డును స్వీకరించారు. ఎంఈవోలు వేణుగోపాలరావు, శివనాయుడు, స్కూల్ కమిటీ చైర్మన్ పాలమరశెట్టి నూకాలయ్య, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

31వ తేదీనే సామాజిక పింఛన్ల పంపిణీ

పాయకరావుపేట: సామాజిక భద్రత పింఛన్లు ఈ నెల 31వ తేదీన పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీవో ఎ.సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో తేదీ ఆదివారం కావడంతో ముందుగా శనివారమే పింఛన్లు పంపిణీ చేయాలని నిర్ణయించినట్టు పేర్కొన్నారు.

అందుబాటులో సంపూర్ణ పశుదాణా

మాడుగుల : రైతు సేవా కేంద్రాల్లో ప్రభుత్వ రాయితీలపై సంపూర్ణ మిశ్రమ దాణా అందుబాటులో ఉందని, ఏడీ వి చిట్టినాయుడు అన్నారు. గురువారం ఆయన మాడుగులలో విలేకరులతో మాట్లాడారు కేజీ మిశ్రమ దాణా రూ. 15.90 కాగా సబ్సిడీ రూ.9.40 పోగా రైతు వాటాగా రూ. 6.50 చెల్లించాలన్నారు. చాఫ్‌కట్టర్లు యూనిట్ ఖరీదు రూ. 33,970 కాగా సబ్సిడీ రూ.13,588 పోను రైతులు రూ.20,382 చెల్లించాలన్నారు. తెల్లరేషన్ కార్డులున్న పాడి రైతుల పశువులకు ప్రభుత్వం అందజేస్తున్న పశు బీమా అందుబాటులో ఉందన్నారు. రూ.30 వేలకు బీమా పొందడానికి రూ. 398, 40 వేలుకు రూ.1061, అలాగే 50 వేలుకు రూ.1723, 60 వేలుకు 2, 385 పశు బీమా కొరకు రైతులు చెల్లించాలన్నారు.

స్థిరంగా కూరగాయల ధరలు

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం కూరగాయల ధరలు దాదాపు స్థిరంగా ఉన్నాయి. కొన్నింటి ధరలు తగ్గాయి. బెట్టు మీద ఉన్న వంకాయ ధర దాదాపు సగానికి తగ్గింది. కిలో రూ.40కి అమ్మకాలు సాగాయి. ఇదే ధరకు టమాటా, బీరకాయ, బంగాళదుంప, బెండకాయ విక్రయాలు జరిగాయి. ఉల్లి రూ.50 నుంచి రూ.60, బీట్‌రూట్, క్యారెట్, కాకరకాయ రూ.60కి విక్రయాలు సాగాయి.

గజముఖం.. విభిన్న రూపం




- చవితికి ముస్తాబవుతున్న గణనాథుని ప్రతిమలు
- రాత్రి, పగలు కష్టపడి తయారు చేస్తున్న కళాకారులు
- అందుబాటులో రూ.50 నుంచి రూ.50 వేలు విలువైన విగ్రహాలు

కోటవురట్ల: వినాయకుడు.. లంబోదరుడు.. గణేశుడు.. ఏకదంతుడు.. వక్రతుండుడు.. బొజ్జ గణపయ్య.. ఇలా ఏ పేరుతో పిలిచినా ప్రతి ఒక్కరికీ ఇష్టమైన ఆది దేవుడు గణనాథుడే. విఘ్నాలు తొలగించి విజయాలను చేకూరుస్తాడని వినాయకుడికి తొలి పూజ చేస్తారు. హిందువులకు వినాయక చవితి నుంచి వరుసగా పండగల సందడి మొదలవుతుంది. ఇక వినాయక చవితి సంబరాలలో పెద్దల కంటే ఎక్కువగా చిన్నారులు, యువతే సందడి చేస్తారు. గణపతి బప్పా మోరియా అంటూ భక్తితో ఊగిపోతారు. ఆ సంబరం రానే వచ్చింది. వచ్చేనెల 7న వినాయక చవితి సంబరాలు ప్రారంభం కానుండగా.. ఇందు కోసం వాడవాడలా గణేశుని మండపాలను సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో గణేశుడు పూజలందుకోవడానికి కళాకారుల చేతిలో తుది మెరుగులు దిద్దుకుంటున్నాడు.

రూ.కోట్లలో విక్రయాలు

పాయకరావుపేట నియోజకవర్గంలో సుమారు 40 కుటుంబాలు విగ్రహాల తయారీలో ఉండగా సుమారు 200 మంది కళాకారులు శ్రమిస్తున్నారు. నియోజకవర్గంలో పాయకరావుపేట, కోటవురట్ల, ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డులో విగ్రహాల తయారు చేసే కళాకారులు ఉన్నారు. మూడు నెలలుగా గణనాథుడి ప్రతిమలను తయారు చేస్తున్నారు. ప్రస్తుతం తుది మెరుగులు దిద్దుతున్నారు. కోటవురట్లలో 8 కుటుంబాలు ప్రతిమలను తయారు చేస్తుండగా.. ఇక్కడి నుంచి హోల్‌సేల్‌గా విక్రయాలు చేపడుతున్నారు. కోటవురట్లలోనే వినాయక చవితికి సుమారు రూ.30 లక్షల వ్యాపారం జరుగుతోంది. ఇక్కడి నుంచి విశాఖ, అమలాపురం, కాకినాడ, తాళ్లరేవు, సామర్లకోట, రాజమండ్రి, తుని, నర్సీపట్నం ప్రాంతాలకు హోల్‌సేల్ వ్యాపారులు విగ్రహాలను కొనుగోలు చేసి తీసుకెళుతుంటారు. ఇలా పాయకరావుపేట నియోజకవర్గంలో వినాయక చవితికి విగ్రహాల వ్యాపారం రూ.కోటి పైగానే సాగుతోంది. భక్తుల విజ్ఞప్తి మేరకు వివిధ రూపాలలో విగ్రహాలను తయారు చేసి విక్రయిస్తుంటారు.



ఆకట్టుకుంటున్న గణనాథుని ప్రతిమ

కళాకారులకు ఆర్థిక ఆసరా

చేతివృత్తులు కనుమరుగైన వేళ హిందూ పండగలు వారికి జీవనోపాధిని కల్పించి ఆర్థిక ఆసరా ఇస్తున్నాయి. ఒకప్పుడు మట్టి పాత్రలకు ఎంతో డిమాండ్ ఉండేది. కుమ్మరులు కులవృత్తితో జీవనం గడిపేవారు. ఇప్పుడు మట్టి పాత్రలు వాడేవారు చాలా తక్కువ మందే ఉన్నారు. దాంతో వారి చూపు ఇతర వ్యాపారాలపై పడింది. వారికి అలవాటైన వృత్తి మట్టితో అలవోకగా ఎటువంటి రూపమైనా ఇట్టే తయారు చేయడం. అదే ఇప్పుడు వారికి కడుపు నింపుతోంది. వినాయక చవితి సంబరాలను వాడవాడలా జరుపుకొంటారు. ఇందుకు వినాయకుని ప్రతిమలకు మంచి డిమాండ్ ఉంది. ఇంట్లో పూజలకు రూ.50 విలువ చేసే గణనాథుని విగ్రహాలతో పాటు వీధుల్లో మండపాలలో కొలువుదీరే రూ.50 వేల విలువ చేసే ప్రతిమల తయారీలో కళాకారులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇంటిల్లిపాదీ విగ్రహాల తయారీలో నిమగ్నమై ఉపాధి పొందుతున్నారు. హైదరాబాద్ నుంచి 40 రకాల రూపాలు కలిగిన అచ్చులను అద్దెకు తీసుకొచ్చి ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో విగ్రహాలను తయారు చేస్తారు.

3 నెలలుగా శ్రమిస్తున్నాం..



వినాయకుడి ప్రతిమల తయారీకి మూడు నెలలుగా శ్రమిస్తున్నాం. మా దగ్గర రూ.30 వేలు విలువ చేసే విగ్రహాలు వరకు ఉంటాయి. అమలాపురం, తాళ్లరేవు, కాకినాడ, రాజమండ్రి, తదితర పట్టణాల నుంచి వచ్చి విగ్రహాలు కొనుక్కుని వెళ్తుంటారు. ఈ మూడు నెలలు చాలా నిష్ఠగా ఉంటాం. భక్తుల కోరిన రూపాలలో విగ్రహాలను తయారు చేస్తాం. సుమారు 40 రూపాల్లో విగ్రహాలు ఉన్నాయి.

– మల్లి లోవకుమారి, కళాకారిణి, కోటవురట్ల

మట్టి విగ్రహాలు మా ప్రత్యేకత..



మట్టి విగ్రహాలు మా ప్రత్యేకత. ఇంట్లో పూజలకు అవసరమైన చిన్న సైజుల్లో వినాయకుడి ప్రతిమలను మట్టితో తయారు చేస్తాం. మా దగ్గర రూ.50 నుంచి రూ.500 విలువ చేసే విగ్రహాలు ఉంటాయి. చాలా ప్రాంతాల నుంచి హోల్‌సేల్‌గా కూడా కొనుక్కుని వెళతారు. 3 నెలలుగా ఈ పనిలో ఉన్నాం.

– మల్లి గోపాలరావు, కళాకారుడు, కోటవురట్ల

సంపద తయారీ కేంద్రాలతో అదనపు ఆదాయం



ఉమ్మలాడ సంపద తయారీ కేంద్రంలో వానపాములను వదులుతున్న అధికారులు

మునగపాక: సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని జిల్లా అధికారి నాగమణి అన్నారు. మండలంలోని ఉమ్మలాడ సంపద తయారీ కేంద్రంలో గురువారం వానపాములను వదిలారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కేంద్రాల్లో తయారు చేసే ఎరువులను రైతులకు అందించాలన్నారు. ఎరువుల ద్వారా రైతులకు మేలు జరుగుతుందన్నారు. అలాగే పంచాయతీలకు కూడా అదనపు ఆదాయం లభిస్తుందని చెప్పారు. అధికారులు కేంద్రాల నిర్వహణపై బాధ్యతగా వ్యవహరించాలన్నారు. డీఎల్‌డీవో మంజులావాణి, ఈవోఆర్డీ వెంకటలక్ష్మి, కార్యదర్శి నాగేశ్వరరావు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నాగులాపల్లి సంపద తయారీ కేంద్రాన్ని కూడా వారు సందర్శించారు.

వమ్మవరంలో ఘనంగా మహాలక్ష్మమ్మ జాతర



జాతర పూజలందుకున్న మహాలక్ష్మి అమ్మవారు

ఎస్.రాయవరం: వమ్మవరం శ్రీమహాలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి వర్షం కురుస్తున్నప్పటికీ అమ్మవారికి పసుపు కుంకుమలు ఇచ్చేందుకు పోటీ పడ్డారు. అదే క్రమంలో రాత్రికి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అలరించారు.

మాతా, శిశు మరణాల నివారణే లక్ష్యం



హరిపాలెంలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌ను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ టీమ్ సభ్యులు

మునగపాక(అచ్యుతాపురం): మాతా శిశు మరణాల నివారణే లక్ష్యంగా వైద్య సిబ్బంది పని చేయాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి డాక్టర్ లూసీ కార్డిలియా సూచించారు. అచ్యుతాపురం మండలం హరిపాలెం విలేజ్ హెల్త్ క్లినిక్‌ను గురువారం జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యులు సందర్శించారు. వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలింతలు, గర్భిణుల్లో రక్తహీనత సమస్య లేకుండా చూడాలన్నారు. ఇందుకు సంబంధించిన వైద్య సేవలు అందుబాటులో ఉండాలన్నారు. ప్రతి కాన్పు పీహెచ్‌సీలలో జరగాలన్నారు. సీజనల్ వ్యాధులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం హరిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 30 మంది విద్యార్థులకు రక్త పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గణాంకాధికారి రామచంద్రరావు, డీపీవో జగదీష్, ఐడీఎస్పీ కో–ఆర్డినేటర్ జనార్దన్, వైద్యాధికారి ఎ.వసంత కుమార్, ఎంపీహెచ్‌ఈవో సూరిశెట్టి శ్రీనివాసరావు, ఆరోగ్య పర్యవేక్షకులు సునీత, ఉమామహేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



యలమంచిలిలో హాకీ విజేతలతో నిర్వాహకులు



హరిపాలెం జెడ్పీ హైస్కూల్‌లో బహుమతులు పొందిన విద్యార్థులు

మునగపాక(అచ్యుతాపురం): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని హరిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం శ్రీపాద రవి కోరారు. హాకీ మాంత్రికుడు ధ్యానచంద్ జయంతిని పురస్కరించుకుని అచ్యుతాపురం మండలం హరిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన లఘు నాటికలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పీడీ దర్మిరెడ్డి రాజు, గాంధీ, బాష, పట్నాయక్, కుమార్, రమణి, అమ్మాజీ, తదితరులు పాల్గొన్నారు.

హాకీ విజేతలకు బహుమతుల ప్రదానం

యలమంచిలి రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో గురువారం సాయంత్రం నిర్వహించిన జిల్లా స్థాయి హాకీ పోటీల్లో విజేతలకు పట్టణ ఎస్‌ఐ కె.సావిత్రి, డిగ్రీ కళాశాల పీడీ పోలిరెడ్డి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా హాకీ అసోసియేషన్ కార్యదర్శి కొఠారు నరేష్, నరసింగరావు, రాంబాబు, త్రివేణి, రూపేష్ పాల్గొన్నారు.



నక్కపల్లి హైస్కూల్‌లో ధ్యాన్‌చంద్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న బీఎస్ హాకీ క్లబ్ సభ్యులు

ధ్యాన్‌చంద్‌కు ఘన నివాళి

నక్కపల్లి: స్థానిక హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ధ్యాన్‌చంద్ చిత్ర పటానికి బీఎస్ హాకీ క్లబ్ ఫౌండర్ బలిరెడ్డి సూరిబాబు, కార్యదర్శి కొల్నాటి తాతాజీ, కోచ్ రాంబాబు, జాతీయ క్రీడాకారుడు రామచంద్రరావు పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇటీవల జాతీయ స్థాయి హాకీ టోర్నమెంట్‌లో గెలుపొందిన హాకీ క్రీడాకారులకు సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ వీసం రాజు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పోలనాటి నానాజీ, జనసేన మండల అధ్యక్షుడు నానిబాబు, హైస్కూల్ హెచ్‌ఎం రాణి లలిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముసురుకున్న వాతావరణం



యండపల్లిలో వరినాట్లు వేస్తున్న కూలీలు

కోటవురట్ల: అల్పపీడన ప్రభావంతో వాతావరణం ముసురుకుంది. గురువారం తెల్లవారు జాము నుంచి మేఘాలు కమ్ముకుని వర్షం కురిసింది. రోజంతా వర్షం పడుతూనే ఉండడంతో జనజీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాలు వర్షపు నీటితో నిండిపోయాయి. యండపల్లి, జల్లూరు, పాములవాక, అన్నవరం, లింగాపురం, రాజుపేట, కైలాసపట్నం ప్రాంతాలలో జోరుగా వరినాట్లు వేశారు.

అచ్యుతాపురంలో..

మునగపాక(అచ్యుతాపురం): అచ్యుతాపురం మండల వ్యాప్తంగా గురువారం మోస్తారు వర్షం కురిసింది. వరి నాట్లుకు ఈ వర్షం అనుకూలంగా ఉంటుందని అధికారులు తెలిపారు.

మునగపాకలో..

మునగపాక: మండలంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మండల సముదాయానికి వెళ్లే మార్గంలో వర్షపు నీరు నిలిచిపోయింది. ఈ వర్షం వరి సాగుకు మేలు చేస్తుందని మండల వ్యవసాయాధికారి సీహెచ్ జ్యోత్స్నకుమారి తెలిపారు.

తెలుగు భాష అజరామరం

- ఘనంగా తెలుగు భాషా దినోత్సవం
- గిడుగు రామమూర్తికి ఘన నివాళి



రాజుపేట ఎంపీయూపీ స్కూల్‌లో రామమూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



పాయకరావుపేట శాఖా గ్రంథాలయంలో గిడుగు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న పాఠకులు



తెలుగులో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆశ

యలమంచిలి రూరల్: తెలుగు భాష అజంతం.. అజరామరం.. అని పలువురు భాషాభిమానులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అన్నారు. వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి జయంతిని పురస్కరించుకుని గురువారం యలమంచిలి మండలం జంపపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు తెలుగు వర్ణమాలలోని అ, ఆ అక్షరాల రూపంలో ఏర్పడి ఆకట్టుకున్నారు. వారిని ప్రధానోపాధ్యాయుడు ఏపీ హెచ్ శాస్త్రి, ఉపాధ్యాయులు అభినందించారు.

కోటవురట్ల: తెలుగు భాషా దినోత్సవాన్ని రాజుపేట ఎంపీయూపీ స్కూల్‌లో హెచ్‌ఎం నానిమణిమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామమూర్తి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మునగపాక: మండలంలోని పాటిపల్లి మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో తెలుగులో 100 మార్కులకు 99 మార్కులు సాధించిన 34 మంది విద్యార్థులకు ప్రిన్సిపాల్ పీలా ఆశ ప్రశంసా పత్రాలు అందజేశారు. తెలుగు ఉపాధ్యాయులు పెంటకోట పద్మ నాగమణి, బుద్ధదేవ జగదాంబ, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

పాయకరావుపేట: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో గిడుగు రామమూర్తి చిత్ర పటానికి గ్రంథాలయ ఇన్‌చార్జ్ వామాల లక్ష్మణరావు ఆధ్వర్యంలో పాఠకులు పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు టి.వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు సీతారామమూర్తి, అచ్యుతరావు, తాళరాజు, తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి రూరల్: వ్యవహారిక భాషోద్యమ నాయకుడు గిడుగు రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని గురువారం పట్టణం, మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పురుషోత్తపురం జెడ్పీ స్కూల్‌లో విద్యార్థులు తెలుగుతల్లి, గిడుగు రామమూర్తి, శ్రీకృష్ణుడు, పాండవుల వేషధారణలో అలరించారు. అంతకుముందు గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు గ్రామ పెద్దలు, పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు నివాళులర్పించారు. హెచ్‌ఎం డి.శోభారాణి మాట్లాడుతూ తెలుగు భాషను విస్మరించొద్దన్నారు.



యలమంచిలి మండలం జంపపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 'అ' ఆకారంలో విద్యార్థుల విన్యాసం



పురుషోత్తపురం జెడ్పీ స్కూల్‌లో పాండవుల వేషధారణలో విద్యార్థులు



సోమలింగపాలెం పాఠశాలలో గిడుగు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

- సోమలింగపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు బీవీఎస్ సాయిబాబా.. గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు ఉపాధ్యాయుడు సంజీవకుమార్ తెలుగు భాష ఔన్నత్యాన్ని విద్యార్థులకు వివరించారు. తెలుగు భాషపై విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పారిశుధ్యం, పరిశుభ్రతతో ఆరోగ్యం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ సత్యవతి

కె.కోటపాడు : పారిశుధ్యం, పరిశుభ్రత మెరుగుపర్చుకోవడం ద్వారా మంచి ఆరోగ్యం కలగనున్నట్టు ఏపీ మహిళా సాధికారిత జిల్లా కోఆర్డినేటర్ సత్యవతి అన్నారు. కె.కోటపాడు వెలుగు కార్యాలయంలో వీవీవో, సీసీలతో నీరు, పారిశుధ్యం, పరిశుభ్రతపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ ప్రతి కుటుంబం వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకోవాలని, ఆరుబయట మలవిసర్జనకు దూరంగా ఉండాలని కోరారు. సురక్షిత మంచినీటి వాడకం, ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. దోమల నివారణ ద్వారా మలేరియా, డెంగ్యూ వ్యాధుల నుంచి దూరంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకటలక్ష్మి, డీఆర్‌డీఏ హెచ్.డి వాష్, కోఆర్డినేటర్ పద్మావతి, స్త్రీనిధి స్టేట్ డైరెక్టర్ బి.జయలక్ష్మి, సీసీలు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మరిడిమాంబ పండగ



కళాకారుల పులి వేషాల ప్రదర్శన



మరిడమ్మతల్లి ఆలయం వద్ద భక్తుల తాకిడి

కోటవురట్ల: వరాహ నది తీరాన కొలువుదీరిన మరిడిమాంబ అమ్మవారి పండగను గురువారం ఘనంగా జరుపుకొన్నారు. ఆలయం వద్ద వేకువజాము నుంచి భక్తుల సందడి నెలకొంది. సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పులి వేషాలు, కోలాటం, కేరళ డ్యాన్స్ విశేషంగా ఆకట్టుకున్నాయి.